క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

ఏర్పేడు: మండలంలోని రాజులకండ్రిగలో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మడిబాక, రాజులకండ్రిగ, ఎండీ పుత్తూరు, బీసీ కాలనీ, కందాడు తదితర గ్రామాల నుంచి వచ్చిన 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో పదిమంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి సోమవారం తిరుపతిలోని అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ రాజేష్ తెలిపారు.

జనావాసాల్లో అనుమతులు ఇవ్వొద్దు



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న యువజనసంఘాల నాయకులు

శ్రీకాళహస్తి: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాలకు జనవాసాల్లో అనుమతులు ఇవ్వవద్దని యువజన సంఘాల నాయకులు ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డిని కోరారు. శుక్రవారం వారు ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో అనుమితిస్తుంటారన్నారు. అయితే సమీపంలో అన్న క్యాంటీన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు కోగిలి మునిచందు, కత్తి రవి, జాకీర్, అభి, సతీష్, సల్మాన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



చింతలపాళెం ఎస్సీ కాలనీలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చింతలపాళెం ఎస్టీ కాలనీ, పాపానాయుడుపేట మిట్టఇండ్లు, ఎస్టీ కాలనీలో ర్యాలీ, అవగాహనా కార్యక్రమాలు జరిపారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ రత్నమ్మ, ప్రగతి సంస్థ మండల కో–ఆర్డినేటర్లు సుబోస్, శిరీషా పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహా పొందండి

నారాయణవనం: ఉచిత న్యా య సలహాలను ఫోన్ ద్వారా పొందే అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నారాయణవనం ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఉచిత న్యాయ సలహా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తమ కు జరిగిన అన్యాయానికి రుసుము లేకుండా ఉచితంగా న్యాయం కోసం సలహా పొందే అవకాశాన్ని న్యాయస్థానాలు అందుబాటులోకి తె చ్చాయన్నారు. బాధితులు న్యాయ సలహా కోసం 15100 నంబర్‌కు డయల్ చేసి పొందవచ్చన్నారు.

ప్రభుత్వ భవనం.. నిరుపయోగం

వరదయ్యపాలెంలో నిరుపయోగంగా ఉన్న తెలుగుగంగ సహాయ ఇంజినీర్ కార్యాలయం



రూ.లక్షల వ్యయం.. ప్రభుత్వ భవనాల నిర్మాణం.. కొన్నాళ్లకే పలు కారణాలతో అవి నిరుపయోగం.. మరమ్మతులు.. వినియోగానికి నోచని వైనం.. కాలక్రమంలో శిథిలం.. వెరసి పలు కార్యాలయాలకు కరువైన సొంత భవనం..అద్దె ఇళ్లే శరణ్యం.. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తిన చందం..ఫలితం ప్రజాధనం దుర్వినియోగం. ఇదీ వరదయ్యపాళెంలో పరిస్థితి.

- వృథాగా ప్రభుత్వ కార్యాలయ భవనాలు
- పలు కార్యాలయాలకు భవనాలు కరువు
- పట్టించుకోని అధికారులు

వరదయ్యపాళెం: రూ.లక్షల విలువైన ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. భవనాలు శిథిలావస్థకు చేరినా వాటిని బాగుచేయాలన్న తపన ప్రభుత్వానికి ఏమాత్రం పట్టలేదు. చాలా కార్యాలయాలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కాలం వెల్లదీస్తున్నాయి. అయితే ఉన్నవాటిని బాగు చేసి, ఆ కార్యాలయాలను ఆ బిల్డింగ్‌లోకి మార్చాలన్న ఆలోచన లేదు. నిరుపయోగ భవనాలను బాగు చేసి, వినియోగంలోకి తెస్తే ప్రభుత్వానికి అద్దెలు కూడా మిగులుతాయి. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. వరదయ్యపాళెం మండలంలో తెలుగుగంగ, సింగిల్‌విండో, అటవీశాఖకు చెందిన రూ.లక్షల విలువ చేసే భవనాలు శిథిలమైపోతున్నాయి. సింగిల్ విండో సహకార సొసైటీ కార్యాలయం, బీసీ హాస్టల్ వంటి కార్యాలయాలు నేటికి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

నిరుపయోగంగా సహకార భవనాలు

మండలంలోని కదూరు సింగిల్ విండోకి చెందిన కదూరు, సంతవేలూరు, బత్తలవల్లం, చిన్నపాండూరు ప్రాంతాల్లో రూ.లక్షల విలువచేసే సహకార భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.



వాడుకలో లేని కదూరు సింగిల్ విండో భవనం

కొన్నిచోట్ల కొందరు అనధికారికంగా సంబంధిత భవనాలను తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

శిథిలమవుతున్న తెలుగుగంగ భవనాలు

మండలంలోని చిన్నపాండూరు, వరదయ్యపాళెంలోని ఇందిరాకాలనీ వద్ద గతంలో తెలుగుగంగ కార్యాలయాలు ఉండేవి. అయితే ప్రస్తుతం రెండు ప్రాంతాల్లోనూ తెలుగుగంగకు సంబంధించి కార్యకలాపాలు జరగకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా సంబంధిత రెండు కార్యాలయాలు మూతపడ్డాయి. అప్పట్లో అధికారులు ఉండడానికి ఖరీదైన క్వార్టర్స్ కూడా నిర్మించారు. అవి కూడా కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని భవనాలు బాగున్నప్పటికీ ఆ భవనాలకు చెందిన తలుపులు, కిటికీలు రాత్రికిరాత్రే దోపిడీకి గురవుతున్నా పట్టించుకునే దిక్కులేదు.

పర్యాటకులకు దూరంగా అటవీ అతిథి భవనాలు

వరదయ్యపాళెంలోని ఉబ్బలమడుగు సీబీఈటీ పర్యాటక కేంద్రానికి చెందిన అటవీశాఖ అతిథి భవనాలు వసతుల లేమితో పర్యాటకులకు వాడుకలో లేకుండా నిరుపయోగంగా మారాయి. 15 ఏళ్ల కిందట వరదయ్యపాళెంలోని అటవీ శాఖకు చెందిన రెండు భవనాలకు మరమ్మతులు చేసి సంబంధిత భవనాలను ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రం సందర్శనకు వచ్చే పర్యాటకుల అవసరాల నిమిత్తం అతిథి గృహాలకు కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ భవనాలకు పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడం, ఆ భవనాల అభివృద్ధికి అటవీ అధికారుల తోడ్పాటు కొరవడడంతో నిరుపయోగంగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు రాత్రివేళ అక్కడ ఉండాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మూతపడిన ఉబ్బలమడుగు సీబీఈటీ భవనాలు

అంబేడ్కర్ భవన స్థలం కబ్జాకు కుట్ర

రేణిగుంట : మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్ లో 2018లో అంబేడ్కర్ భవనానికి కేటాయించిన 30 సెంట్లు భూమిని కబ్జా చేసేందుకు ప్రస్తుత టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రేణిగుంట మండలశాఖ సభ్యులు ఆరోపిస్తున్నారు. రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం దళిత సంఘం నాయకులతో నిరసన చేపట్టారు. సమత సైనిదళ్ రాయలసీమ కోఆర్డినేటర్ రెడ్డెప్ప, టీడీపీ నాయకుల మధ్య జరిగిన అంబేడ్కర్ భవన స్థల వివాదంలో తెలుగుదేశం నాయకులు దళితులపై దాడి చేశారని రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని నిరసిస్తూ శుక్రవారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రేణిగుంట మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ భవన నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం చర్చించారు. ఈ సందర్భంగా రెడ్డెప్ప మాట్లాడుతూ 2018లో 30 సెంట్లు భూమిని అంబేడ్కర్ భవనం నిర్మాణానికి కేటాయించారని అన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు బుజ్జి నాయుడు, బాలాజీ తదితరులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అంబేడ్కర్ భవన నిర్మాణానికి చేపట్టిన పనులను టీడీపీ నాయకులు అడ్డుకుని, తమపై దాడి చేశారని ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తులసిరాజన్, ఐజయ్య, మధు, మురళి, చలపతి, సెల్వ రాజు, ఆంటోని, మురగయ్య, కంజాక్షి కుమార్, మునిరత్నం, కస్తూరి, వాణికుమారి పాల్గొన్నారు.



రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

మద్యం దుకాణాల్లో సిబ్బంది చేతివాటం

వరదయ్యపాళెం: మరో రెండు రోజుల్లో ప్రైవేటు మద్యం దుకాణాలు రానున్న నేపథ్యంలో దుకాణ సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. మందుబాబుల నుంచి ఇష్టారాజ్యంగా ఎమ్మార్పీ కంటే అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మందుబాబులు ఏకంగా వరదయ్యపాళెంలోని మద్యం దుకాణాన్ని మూసివేసి నిరసన తెలిపారు. మందుబాబుల కథనం మేరకు.. వరదయ్యపాళెంలోని రెండు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొద్దిరోజులుగా క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ. 20 వరకు అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనిపై మందుబాబులు శుక్రవారం సాయంత్రం ఎమ్మార్పీ కంటే అధికంగా ఎందుకు వసూలు చేస్తున్నారని నిలదీశారు. దీనిపై సిబ్బంది దురుసుగా మాట్లాడడంతో ఆగ్రహానికి గురైన మందుబాబులు దుకాణం మూసి ని రసన తెలిపారు. సిబ్బంది దోపిడీ చేస్తున్నా ఎక్సైజ్ పోలీసులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

దుష్టసంహారిణి.. మహిషాసురమర్దిని

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి దుష్ట సంహారిణి అయిన మహిషాసురమర్దిని అలంకారం చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. ఆలయంలోని కనక దుర్గమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు బెజవాడ శ్రీకనకదుర్గగా, ఏడుగంగల అమ్మవారు కాళరాత్రి, బంగారమ్మ , పానగల్ గంగమ్మ ప్రత్యేక అలంకారం, ముత్యాలమ్మ, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణంలోని తెట్టులో ఉన్న నల్లగంగమ్మ, విశ్వబ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ఏడుగంగల అమ్మవారు, పలు ఆలయాల అమ్మవార్లు వివిధ రూపాలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా ఆయుధపూజ

ముక్కంటీశ్వరాలయంలో ఆయుధపూజ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామివారి కల్యాణోత్స వేదిక సమీపంలో స్వామి అమ్మవార్ల ఆభరణాలు, ఆయుధాలు, పరివార దేవతల వద్ద ఉన్న ఆభరణాలను ఉంచి పూజలు చేశారు. ఆలయ అర్చకులు నైవేద్యం, దీపారాధన, మంత్రపుష్పం జరిపారు.

మహిషాసురమర్దినిగా సర్వమంగళాదేవి

సత్యవేడు: వీరభ్రస్వామి ఆయలంలో దసరా ఉత్సవాల్లో భాగంగా సర్వమంగళాదేవి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ దేవర్ భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.




శ్రీకాళహస్తి: మహిషాసురమర్దిని అలంకారంలో కనకాచలం కనకదుర్గమ్మ

వీరలక్ష్మీదేవిగా పచ్చాలమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మ శుక్రవారం వీరలక్ష్మీదేవిగా దర్శమిచ్చారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహిషాసురమర్దినిగా రాజరాజేశ్వరీదేవి

ఏర్పేడు: మండలంలోని మత్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో శుక్రవారం రాజరాజేశ్వరీ దేవి మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎండీపుత్తూరు యల్లమ్మ దేవి, చిందేపల్లిలో పార్వతీదేవి, కోబాకలో పోలినాంచారమ్మ, పాపానాయుడు పేట భద్రకాళీదేవి, గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలోని ఆనందవల్లి, కందాడ కామాక్షిదేవి అమ్మవార్లు మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు.



శ్రీకాళహస్తి: మహిషాసురమర్దినిగా ముత్యాలమ్మ

సరస్వతీదేవిగా మరగదాంబిక

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని పల్లికొండేశ్వర స్వామి ఆలయంలోని మరగదాంబిక శుక్రవారం సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్, సతీశ్ శర్మ యాగశాల మండపంలో కలశపూజ, వేదపారాయణం, కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం పంచామృత అభిషేకం, మహాభిషేకం, మహాదీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు కారణి గ్రామానికి చెందిన బి.మాధవి, డాక్టర్ మునిరత్నం కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది పరంథామరెడ్డి, శరవణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సరస్వతీదేవిగా అవనాక్షమ్మ

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం సముదాయంలోని అవనాక్షమ్మ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఆలయాల ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు తదితరులు ఉత్సవాలను పర్యవేక్షించారు. కైలాసనాథకోనలోని కామాక్షాంబిక అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. తిరువట్యంలోని ములస్థాన ఎల్లమ్మ కామాక్షిగా కొలువుదీరారు. ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి వీణావాణి అలంకారంలో దర్శనమిచ్చారు.



సత్యవేడు: మహిషాసుర మర్దినిగా సర్వమంగళాదేవి



బీఎన్‌కండ్రిగ: వీరలక్ష్మీ దేవిగా పచ్చాలమ్మ



ఏర్పేడు: మహిషాసుర మర్దినిగా రాజరాజేశ్వరీ దేవి



నాగలాపురం: సరస్వతీ దేవిగా మరగదాంబిక



నారాయణవనం: సరస్వతీ దేవిగా అవనాక్షమ్మ



నారాయణవనం: వీణావాణిగా ద్రౌపదీదేవి

ఘనంగా పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు

వరదయ్యపాళెం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భువనేశ్వరి, ఉపసర్పంచ్ మహేంద్ర, మండల కార్యదర్శులు మాధవయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి నూకతోటి శుభాకాంక్షలు

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తిరుపతిలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, సీనియర్ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, శివాయాదవ్‌లున్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: మాజీమంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

సత్యవేడులో..

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, రమేష్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, రవిరెడ్డి, ఎంపీపీ రవి, శేఖర్, శ్రీధర్ రెడ్డి, మస్తానీ, పునీద్, బాలయ్య రెడ్డి పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల మాజీ అధ్యక్షుడు హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రోసి రెడ్డి, పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్దిరెడ్డి పేరున అర్చనలు చేయించారు. మండల పార్టీ కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నాయకులు అన్నాదొరై, కిరణ్, రాజారెడ్డి, సర్పంచ్‌లు సాయిరవి, నాగూరు, సుబ్రమణ్యంరెడ్డి, మురళి, ఎంపీటీసీ సభ్యులు శివశంకర్, రవి, పొన్నుస్వామి, శంకరయ్య, నాయకులు గురుస్వామి, బాబు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

రేణిగుంట : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన సందర్భంగా ఆయనకు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రేణిగుంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సి.తిరుమలరెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, గంగయ్య శుభాకాంక్షలు తెలిపారు.



రేణిగుంట : పెద్దిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



వరదయ్యపాళెం: పెద్దిరెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నూకతోటి రాజేష్



వరదయ్యపాళెం: గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి